సాక్షి
చిత్తూరు
సోమవారం । 21 । ఆగస్టు । 2023



శోకసంద్రమైన ముదిరెడ్డిపల్లె

ముదిరెడ్డిపల్లెలో ఏనుగు దాడిలో మృతి చెందిన రైతు మార్కొండయ్యకు అశ్రునయనాలతో అంత్యక్రియలు జరిగాయి. - 8లో



చంద్రయాన్ షెడ్యూల్ సక్సెస్

చంద్రయాన్-3 మిషన్ షెడ్యూల్ ప్రకారం చేపట్టిన ఆపరేషన్ విజయవంతంగా పూర్తిచేసుకుంది. - 8లో

	గరిష్టం	కనిష్టం
చిత్తూరు	37	26
తిరుపతి	37	26
తిరుమల	33	22
గూడూరు	38	28
నగరి	37	27

న్యూస్‌రీల్

కాణిపాకంలో భక్తుల రద్దీ



భక్తులతో నిండిన క్యూలు

కాణిపాకం(యాదమరి): కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయక స్వామి ఆలయానికి శ్రావణమాసం చవితి సందర్భంగా ఆదివారం భక్తులు పోటెత్తారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు భక్తులు తరలి రావడంతో ఆలయం రద్దీగా మారింది. కంపార్ట్‌మెంట్లు, క్యూలు భక్తులతో నిండిపోయాయి. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ అధికారులు తగు చర్యలు తీసుకొని దర్శనం కల్పించారు.

హేమాదిత్యకు ఉత్తమ లఘు చిత్ర అవార్డు



హేమాదిత్యకు బహుమతిని అందజేస్తున్న నటుడు అశ్విన్‌బాబు

పూతలపట్టు: పూతలపట్టు దళితవాడకు చెందిన ఆనగల్లు మునిరత్నం కుమారుడు హేమాదిత్య రూపొందించిన 'అలెర్ట్' లఘు చిత్రానికి ప్రథమ బహుమతి లభించింది. హైదరాబాద్‌లో ఇంటర్నేషనల్ షార్ట్ ఫిలిం ఫెస్టివల్ సందర్భంగా 'సైబర్ క్రైమ్' అనే అంశంతో జూరియల్ స్టూడియోస్ వారు లఘు చిత్ర పోటీలు నిర్వహించారు. ఆదివారం ఫలితాలను విడుదల చేసి హైదరాబాద్‌లో బహుమతులు అందజేశారు. హేమాదిత్య దర్శకత్వంలో రూపొందిన 'అలర్ట్' లఘు చిత్రాన్ని ప్రథమ బహుమతికి ఎంపిక చేశారు. ఉత్తమ లఘుచిత్ర దర్శకుడిగా హేమాదిత్యకు సినీనటుడు అశ్విన్ బాబు రూ.10 వేల నగదు, మెమెంటో అందజేశారు. ఈ సందర్భంగా హేమాదిత్య మాట్లాడుతూ ఇంతటి స్థాయికి రావడానికి ప్రోత్సహించిన తల్లిదండ్రులు, స్నేహితులకు ధన్యవాదాలు తెలిపారు.

నేడు కలెక్టరేట్‌లో స్పందన

చిత్తూరు కలెక్టరేట్ : ప్రజా సమస్యల పరిష్కారం కోసం కలెక్టరేట్‌లో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ షణ్మోహన్ తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రజలు సమస్యలను వినతుల రూపంలో అందజేయ వచ్చని పేర్కొన్నారు. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. అన్ని శాఖల జిల్లా అధి కారులు స్పందనకు తప్పనిసరిగా హాజరుకావాలని, గైర్హాజరైతే శాఖాపరంగా కఠిన చర్యలుంటాయని హెచ్చరించారు.

పోలీసు కార్యాలయంలో

చిత్తూరు అర్బన్: నగరంలోని పోలీసు కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎస్పీ వై.రిశాంత్‌రెడ్డి తెలిపారు. చిత్తూరు వన్ టౌన్ పోలీస్ స్టేషన్ పక్కనున్న ఆర్మ్డు రిజర్వు (ఏఆర్) కార్యాలయంలో ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తామన్నారు. ఏవైనా సమస్యాత్మకంగా ఉంటే నేరుగా తనను కలిసి మాట్లాడవచ్చని పేర్కొన్నారు.

ఏనుగులకు ఆహారం అందజేత



ఆహారం అందజేస్తున్న లయన్స్ క్లబ్ బృందం

రామకుప్పం: ప్రపంచ మానవతా దినోత్సవం సందర్భంగా ఆదివారం కుప్పం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మండలంలోని ననియాల ఎకో టూరిజంలో శిక్షణ పొందిన ఏనుగులకు ఆహారాన్ని అందజేశారు. లయన్స్ జోనల్ చైర్మన్ డాక్టర్ మహేష్ మాట్లాడుతూ వన్యప్రాణులకు ఆహారం అందజేయడం బాధ్యతగా భావించాలని తెలిపారు. ఏనుగులకు పండ్లు, దుంపలు అందజేశారు. ఈ కార్యక్రమంలో కుప్పం అటవీ క్షేత్రాధికారి వైవీరెడ్డి, లయన్స్ క్లబ్ బృందం గంగాధరం, రవీంద్రనాథ్, పసాద్, సెంథిల్, శివ, లెనిన్ పాల్గొన్నారు.

శ్రీవారి దర్శనానికి 12 గంటలు

తిరుమల : తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 13 కంపార్ట్ మెంట్లు నిండాయి. శనివారం అర్ధరాత్రి వరకు 79,242 మంది స్వామివారిని దర్శించుకున్నారు. 36,039 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. శ్రీవారికి కానుకల రూపంలో హుండీ ద్వారా రూ. 3.76 కోట్ల ఆదాయం వచ్చింది. టైంస్లాట్ భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. టికెట్లు లేని వారికి 12 గంటల్లో దర్శనం లభిస్తోంది.

బాబు కోటలో ఫ్యాన్ ప్రకంపనలు



కుప్పం నియోజకవర్గం, శాంతిపురం మండలంలో వైఎస్సార్‌సీపీ శ్రేణుల సంబరాలు

జిల్లాలో పంచాయతీ ఉప ఎన్నికల్లో సైతం వైఎస్సార్ సీపీ మద్దతుదారులు విజయఢంకా మోగించారు. చంద్రబాబు సొంత నియోజకవర్గం కుప్పంలో వైఎస్సార్ సీపీ జెండా రెపరెపలాడింది. చంద్రబాబు ఇల్లు నిర్మిస్తున్న శాంతిపురం మండలం, శివపురం వార్డు సైతం వైఎస్సార్ సీపీ ఖాతాలోకి వచ్చింది. గ్రామీణ స్థాయిలోనూ వైఎస్సార్ సీపీ బలంగా ఉందని ఈ ఫలితాలు నిరూపించాయి. విపక్షాలు ఎంతగా ప్రచారం చేసినా.. ప్రలోభాలకు గురిచేసినా.. మరెంతగా జనంలోకి వెళ్లినా ప్రజలు వైఎస్సార్‌సీపీపై పూర్తి నమ్మకాన్ని చూపించారు. ఇంతటి విశ్వాసం చూపడానికి కారణం అభివృద్ధి.. సంక్షేమం అని విశ్లేషిస్తున్నారు. సాధారణ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో సాక్షాత్తు అధినేత సొంత జిల్లాలో సైకిల్ చక్రం పంక్చర్ కావడంతో పచ్చపార్టీ శ్రేణుల్లో కలవరం మొదలైంది.

- పంచాయతీ ఉప ఎన్నికల్లో ఎదురేలేని వైఎస్సార్ సీపీ
- గ్రామీణ స్థాయిలోనూ బలంగా ఉందని నిరూపించిన ఫలితాలు
- చంద్రబాబు నివాస ప్రాంతంలోనూ వైఎస్సార్ సీపీ జెండా రెపరెపలు
- ఢీ కొట్టలేక..ఢీలాపడ్డ తెలుగుదేశం
- 3 సర్పంచ్ స్థానాలు వైఎస్సార్‌సీపీ ఖాతాలోకే..
- 39 వార్డు స్థానాల్లో వైఎస్సార్ సీపీ మద్దతుదారులు ఘన విజయం
- 5 వార్డు స్థానాలకే పరిమితమైన టీడీపీ, అయోమయంలో పచ్చపార్టీ కేడర్

సాక్షి చిత్తూరు: సాధారణ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో జరిగిన పంచాయతీ ఉప ఎన్నికల ఫలితాలు వైఎస్సార్ సీపీ క్యాడర్‌లో నూతనోత్సాహం నింపగా.. తెలుగుదేశం పార్టీకి షాక్‌కొట్టినట్లైంది. అధినేత కుప్పం నియోజకవర్గంలోనే వైస్సార్ సీపీ మద్దతు అభ్యర్థుల గెలుపుతో తెలుగుదేశం క్యాడర్ డీలాపడిపోయింది. సాధారణ ఎన్నికలకు ముందస్తు తీర్పుగా వైఎస్సార్ సీపీకి అసలైన ప్రజా సర్వేగా ఉందని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. వైఎస్సార్ సీపీ సర్కారు అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలు ఉప ఎన్నికల్లో మద్దతుదారులను గెలిపించేలా చేశాయి. 2019లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో..ఆ తర్వాత జరిగిన స్థానిక సంస్థలు, మున్సిపల్ ఎన్నికలు టీడీపీ ఓటమి చవిచూసిన విషయం తెలిసిందే. తాజాగా శనివారం సర్పంచ్, వార్డు సభ్యుల ఉప ఎన్నికల్లోనూ టీడీపీకి ఘోర పరాజయమే దక్కింది. ఈ వరుస పరాజయాలను చూడలేక చంద్రబాబు చతికిల పడాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఎన్నికలు వచ్చాయంటే ఎలాగైన గెలుపొందాలనే కుట్రలు కుతంత్రాలు పన్నే చంద్రబాబుకు ఈ ఉప ఎన్నికల్లో ప్రజలు తగిన గుణపాఠం చెప్పారు. టీడీపీ ఆవిర్భావం నుంచి కంచుకోటగా ఉన్న చంద్రబాబునాయుడు ప్రాతినిథ్యం వహిస్తున్న కుప్పం నియోజకవర్గంలో వరుస ఓటములతో టీడీపీ కేడర్ బాగా డీలా పడింది. ఆపార్టీ కార్యకర్తల్లో ఎన్నడూ లేని కలవరం మొదలైంది. టీడీపీకి ఈ ఉప ఎన్నికల ఫలితాలు చెంపపెట్టులా మారాయని రాజకీయ విశ్లేషకులు వెల్లడిస్తున్నారు.

ఎన్నికల సమయంలోనే బాబు ప్రేమ

ఎన్నికలు వచ్చే ముందే ప్రజలపై చంద్రబాబుకు ఎనలేని ప్రేమ పుట్టుకొస్తుందని ప్రజలు తీవ్ర ఆగ్రహంతో రగిలిపోతున్నారు. ఈ క్రమంలోనే ప్రస్తుతం జరిగిన ఉప ఎన్నికల్లో ప్రజలు తగిన బుద్ధి చెప్పారు. ఇన్ని సంవత్సరాలు తమను మాయ మాటలతో చంద్రబాబు మోసం చేశారని కుప్పం ప్రజలు తెలుసుకున్నారు. ఎన్నికల్లో గెలిచిన తర్వాత తమను ఏ మాత్రం పట్టించుకోవడం లేదని గుర్తించారు. చుట్టపు చూపులా అప్పుడప్పుడు కుప్పానికి వచ్చి కపట హామీలు ఇచ్చే చంద్రబాబును ప్రజలు నమ్మే పరిస్థితుల్లో లేరని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు.

ప్రభుత్వ పనితీరుకు పట్టం

వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి మేనిఫెస్టోలోని అన్ని హామీలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నెరవేర్చారు. ప్రతిపక్ష నేత చంద్రబాబు ప్రాతినిథ్యం వహించే కుప్పం అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యతనిచ్చారు. చంద్రబాబు పాలనలో అమలు కాని సంక్షేమ పథకాలను, అభివృద్ధిని చేసి చూపించారు. సంక్షేమాన్ని, అభివృద్ధిని చూసి ఓర్వలేక టీడీపీ సైకిల్ ర్యాలీలు, ఇంటింటా ప్రచారాలు, జిమ్మిక్కులు చేసినా ప్రజలు మోసపోకుండా ప్రస్తుత ఉప ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ మద్దతు అభ్యర్థుల పక్షాన నిలిచారు. కుప్పం నియోజకవర్గంలో ఆరు వార్డు స్థానాలకు ఎన్నికలు జరగగా, ఐదు స్థానాల్లో వైఎస్సార్‌సీపీ మద్దతు అభ్యర్థులు గెలిచారు. క్షేత్రస్థాయిలో వైఎస్సార్ సీపీకి బలం ఉందని ఈఫలితాలు తేటతెల్లం చేశాయి.

సర్పంచ్ స్థానాలన్నీ ఏకగ్రీవం

పలు కారణాలతో జిల్లాలోని సర్పంచ్, వార్డు స్థానాలకు ఉప ఎన్నికలు నిర్వహించారు. గంగాధరనెల్లూరు మండలం నెల్లెపల్లె, కార్వేటినగరం మండలం కత్తెరపల్లె, విజయపురం మండలం కాళికాపురం సర్పంచ్ స్థానాల ఉప ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదలైంది. ఇతర పార్టీల మద్దతుదారులెవ్వరూ పోటీ చేయకపోవడంతో వైఎస్సార్ సీపీ బలపరచిన అభ్యర్థులే ఏకగ్రీవంగా గెలుపొందారు. నెల్లేపల్లె పంచాయతీకి గంగయ్య (5వ తరగతి), కత్తెర పల్లెకు నవీన (ఇంటర్మీడియెట్), కాళికాపురం స్థానానికి సెల్వీ (4వ తరగతి) సర్పంచ్‌లుగా గెలుపొందారు.

39 వార్డుల్లో ఫ్యాన్ విజయఢంకా

జిల్లా వ్యాప్తంగా 46 వార్డులకు ఉప ఎన్నికల నోటిఫికేషన్ జారీచేశారు. ఇందులో రెండు వార్డులకు ఎటువంటి నామినేషన్‌లు దాఖలు కాలేదు. మిగిలిన 44 వార్డుల్లో 39 స్థానాల్లో వైఎస్సార్ సీపీ బలపరచిన అభ్యర్థులు ఘన విజయం సాధించారు. కేవలం 5 స్థానాల్లో మాత్రమే టీడీపీ మద్దతుదారులు గెలుపొందారు. శాంతిపురం మండలం కడపల్లె పంచాయతీలో చంద్రబాబు సొంత గృహాన్ని నిర్మించుకుంటున్నారు. కడపల్లె వార్డు స్థానానికి జరిగిన ఎన్నికలో వైఎస్సార్ సీపీ మద్దతు అభ్యర్థి బి.సుధాకర్ (బీసీ రైతు) గెలుపొందారు. ఈ ఓటమితో పచ్చపార్టీలో కలవరం మొద లైంది. చంద్రబాబు ఇలాకాలోనే టీడీపీపై ప్రజలు ఎంత వ్యతిరేకతగా ఉన్నారో ఈ ఫలితాలు తేటతెల్లం చేస్తున్నాయని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. ఎన్నికల్లో గెలుపోటములపై ఊర్లు వదిలిపోవాలని సవాల్ విసిరిన టీడీపీకి ఈ ఫలితాలు చెంపపెట్టుగా నిలిచాయి.

మౌలిక వసతుల కల్పనే ధ్యేయం



జీడీనెల్లూరు మండలం నెల్లేపల్లె పంచాయతీలో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం ఇస్తా. సర్పంచ్‌గా ఉన్న మన్నరయ్య వ్యక్తిగత కారణాలతో రాజీనామా చేయడంతో ఆ స్థానానికి వైఎస్సార్ సీపీ మద్దతు అభ్యర్థిగా ఏకగ్రీవంగా ఎంపిక చేసిన గ్రామస్తుల కష్టాలను తీర్చడమే నా కర్తవ్యం. ఉపముఖ్యమంత్రి నారాయణస్వామి సహకారంతో పంచాయతీలో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా. ముఖ్యంగా సీసీ రోడ్లు, తాగునీటి వసతుల కల్పనకు నా వంతుగా పాటుపడుతా. – గంగయ్య, సర్పంచ్, నెల్లేపల్లె

ఆయన సేవలు కొనసాగిస్తా



గతంలో సర్పంచ్‌గా నా భర్త చిరంజీవిరెడ్డి అనారోగ్యంతో మృతి చెందడంతో ఆ స్థానంలో నన్ను పంచాయతీ ప్రజలు వైఎస్సార్ సీపీ అభ్యర్థిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. చిరంజీవిరెడ్డి గ్రామంలో సీసీరోడ్లను నిర్మించారు. డంపింగ్‌యార్డు అభివృద్ధికి కృషి చేశారు. సచివాలయం, రైతుభరోసా కేంద్రాల నిర్మాణాలను ప్రారంభించారు. రాజకీయాల్లో ఆయనను చూసి ఎంతో నేర్చుకున్నా. ఆయన చేసిన సేవలను కొనసాగిస్తా. ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా.
– నవీన, సర్పంచ్, కత్తెరపల్లె(కార్వేటినగరం)

పంచాయతీ అభివృద్ధే లక్ష్యం



పంచాయతీ అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తాను. నా భర్త మణి సర్పంచ్‌గా పనిచేస్తూ అనారోగ్యంతో చనిపోవడంతో ఈ స్థానంలో వైఎస్సార్ సీపీ మద్దతు అభ్యర్థిగా నన్ను పంచాయతీ ప్రజలు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నా భర్త సర్పంచ్‌గా, ఎంపీటీసీ సభ్యుడిగా పంచాయతీలో పలు అభివృద్ధి పనులు చేపట్టి మంచి గుర్తింపు సంపాదించారు. ఆయనను ఆదర్శంగా తీసుకుని పంచాయతీని అభివృద్ధి బాటలో నడిపిస్తాను.
– సెల్వి, సర్పంచ్, కాళికాపురం(విజయపురం)

భక్తులతో పోటెత్తిన బోయకొండ



క్యూలో వేచి ఉన్న భక్తులు



అమ్మవారిసేవలో జిల్లా న్యాయమూర్తి శ్రీనివాసులు

చౌడేపల్లె: శ్రావణ మాసం సందర్భంగా ఆదివారం బోయకొండ శ్రీగంగమ్మ ఆలయం భక్తులతో పోటెత్తింది. తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుంచి అశేషంగా భక్తులు తరలి వచ్చారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు క్యూలన్నీ భక్తులతో నిండాయి. ఉదయం అమ్మవారికి విశేష పూజలు నిర్వహించి సర్వాంగ సుందరంగా అలంకరించారు. కోర్కెలు తీరిన భక్తులు పిండి, దీవెలతో వచ్చి మొక్కులు చెల్లించారు. పర్యవేక్షణలో భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు.

అమ్మవారి సేవలో జిల్లా న్యాయమూర్తి

శ్రీబోయకొండ గంగమ్మను జిల్లా అదనపు మూడవ సెషన్స్ కోర్టు న్యాయమూర్తి శ్రీనివాసులు ఆదివారం దర్శించుకున్నారు. దేవస్థానం ఈఓ చంద్రమౌళి ఆలయ స్వాగతం పలికి ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. అర్చకులు ఆలయ చరిత్రను వివరించారు. తీర్థప్రసాదాలను అందజేసి సత్కరించారు.

ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు దరఖాస్తులు

చిత్తూరు కలెక్టరేట్ : రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీఈవో విజయేంద్రరావు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ, జిల్లా పరిషత్, మండల పరిషత్, ఎయిడెడ్, పురపాలక, రెసిడెన్షియల్ పాఠశాల్లో పనిచేస్తున్న టీచర్లు దరఖాస్తుకు అర్హులని పేర్కొన్నారు. పది సంవత్సరాల సర్వీసు ఉండాలని తెలిపారు. దరఖాస్తు నమూనాలు సంబంధిత ఎంఈవో, డీవైఈవోల వద్ద పొందవచ్చని పేర్కొన్నారు. పూర్తి చేసిన దరఖాస్తులను ఈ నెల 22లోపు ఎంఈవో, డీవైఈవోల ద్వారా డీఈవో కార్యాలయానికిచేర్చాలని తెలిపారు.

ప్రతిష్టాత్మకంగా సీఎం పర్యటన



సభాస్థలిని పరిశీలిస్తున్న మంత్రులు, అధికారులు

- 28న నగరి విచ్చేయనున్న సీఎం జగన్
- జగనన్న విద్యా దీవెన ప్రారంభం
- ఏర్పాట్లను పరిశీలించిన మంత్రులు, అధికారులు

నగరి: ఈనెల 28న ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి నగరి పర్యటనను విజయవంతం చేయాలని రాష్ట్ర విద్యుత్, అటవీ, పర్యావరణ పరిరక్షణ, భూగర్భ గనులు శాఖ మంత్రి డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం నగరి మున్సిపల్ కార్యాలయ సమావేశ మందిరంలో డిప్యూటీ సీఎం కె.నారాయణస్వామి, పర్యాటక, క్రీడా శాఖ మంత్రి ఆర్కే రోజా, చిత్తూరు ఎంపీ ఎన్.రెడ్డెప్ప, జెడ్పీ చైర్మన్ జి.శ్రీనివాసులు, జిల్లా కలెక్టర్ ఎస్.షణ్మోహన్, ఎస్పీ వై.రిశాంత్‌రెడ్డి, ఎమ్మెల్సీ భరత్, సత్యవేడు, పూతలపట్టు ఎమ్మెల్యేలు కె.ఆదిమూలం, ఎంఎస్.బాబు, జేసీ పి.శ్రీనివాసులు, డీఆర్ఓఎస్ రాజశేఖర్‌తో కలిసి అన్ని శాఖల అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. మంత్రి పెద్దిరెడ్డి మాట్లాడుతూ చిత్తూరు జిల్లాలో ముఖ్యమంత్రి పర్యటనలను అధికారుల కృషితో రాష్ట్ర స్థాయిలో గొప్పగా నిర్వహించినట్లు తెలిపారు. నగరిలో విద్యా దీవెన పథకాన్ని లాంఛనంగా ప్రారంభించడానికి సీఎం వస్తున్నారని, ఈ పర్యటనను ప్రతిష్టాత్మకంగా తీసుకొని అధికారులందరూ సమన్వయంతో పనిచేసి విజయవంతం చేయాలని కోరారు. అంతకుముందు హెలీప్యాడ్, బహిరంగ సభ, రోడ్డు షో స్థలాలను మంత్రులు, అధికారులు పరిశీలించారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ ప్రభాకర్‌రెడ్డి, డీఆర్‌డీఏ, మెప్మా పీడీలు తులసీ, రాధమ్మ, నగరి ఆర్డీఓ సుజన, మున్సిపల్ కమిషనర్ కె.వెంకట్రామిరెడ్డి, తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి, ఎంపీడీఓ లీలామాధవి ఇతర శాఖ అధికారులు పాల్గొన్నారు.

కరిరాజుకు కరెంట్ కాటు

కౌండిన్య ఎలిఫెంట్ శాంచురీని నుంచి మేతకోసం అడవిని దాటి పంట పొలాల్లోకి వచ్చే ఏనుగులకు కరెంట్ పెద్ద శత్రువులా మారింది. ఇప్పటి వరకు కరెంట్ షాక్‌లతో 14 ఏనుగులు మృతిచెందగా.. తాజాగా బైరెడ్డిపల్లె మండలం నల్లగుట్లపల్లె వద్ద మరో ఆడ ఏనుగు కరెంటుకు బలైంది. వంటిపై దురద తీర్చుకోవడానికి కరెంటు స్థంభాలను రుద్దడం, తొండంతో విరగ్గొడుతుండడంతో తీగలు పైన పడుతున్నాయి. మరికొన్ని చోట్ల రైతుల పొలాల వద్ద తక్కువ ఎత్తులోని 12కేవీ కరెంటు వైర్లు తగిలి మృతిచెందుతున్నాయి.

- బైరెడ్డిపల్లె మండలంలో కరెంటుకు ఏనుగు బలి
- పదేళ్లలో కరెంట్ షాక్‌లతో 15 ఏనుగుల మృతి
- విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లను టార్గెట్ చేస్తున్న ఏనుగులు
- అడవి దాటితే ఏనుగులకు ప్రాణగండం



బైరెడ్డిపల్లె మండలం నల్లగుట్లపల్లి వద్ద శనివారం రాత్రి కరెంట్ షాక్‌తో మృతి చెందిన ఏనుగు

పలమనేరు: కౌండిన్య అభయారణ్యంలో కరెంటుకు ఏనుగులు బలి అవుతున్నాయి. ఇప్పటి పలు ఘటనల్లో 20 ఏనుగులు మృతిచెందగా, ఇందులో 15 ఏనుగులు కరెంట్ తీగలు తగిలి చనిపోవడం బాధాకరం. అభయారణ్యంలో మొత్తం వందకుపైగా ఏనుగులున్నాయి. ఇవి గుంపులు గుంపులుగా సంచరిస్తున్నాయి. ముసలిమొడుగు, జగమర్ల, మొగిలిఘాట్, నెల్లిపట్ల, వెంగంవారిపల్లి, తోటకనుమ ప్రాంతాల్లో గుంపులుగా తిరుగుతున్నాయి. మదపుటేనుగులు ఒంటరిగానే సంచరిస్తున్నాయి. కౌండిన్య అభయారణ్యం నుంచి ఏనుగులు బయటికి రాకుండా అటవీశాఖ నిర్మించిన ఎలిఫెంట్ ట్రెంచీలు, సోలార్‌ఫెన్సింగ్ పెద్దగా ఫలితాలను ఇవ్వడం లేదు. తెలివైన జంతువుగా పేరున్న గజరాజులు ట్రెంచీలను పూడ్చి, బండలను వాటిల్లోకి దొర్లించి, సోలార్ ఫెన్సింగ్‌ను విరగ్గొట్టి అడవి నుంచి బయటకు వచ్చేస్తున్నాయి. ఏనుగుల సమస్యకు శాశ్వతచర్యలు తీసుకోకుంటే భవిష్యత్తులో కౌండిన్యాలో ఏనుగుల జాడ కనుమరుగైయ్యే అకాశాశం ఉంది.

బలమైన ఫెన్సింగ్ నిర్మాణంతోనే కట్టడి

కౌండిన్యా అడవిలో 66 కిలోమీటర్ల మేర సోలార్ ఫెన్సింగ్‌ను గతంలో నిర్మించారు. ఇందులో కొన్ని చోట్ల సోలార్ ఫెన్సింగ్‌కు అమర్చిన డీసీ బ్యాటరీలు పనిచేయక విద్యుత్ ప్రసరించడం లేదు. కొత్తగా ఏర్పాటు చేసిన సోలార్ ఫెన్సింగ్‌లో మరీ తేలిగ్గా ఉన్న పైపులున్నచోట వీటిని ఏనుగులు తొక్కి నాశనం చేస్తున్నాయి. సోలార్ ఫెన్సింగ్‌తోబాటు కౌండిన్య అటవీప్రాంతంలో 12 చోట్ల 74 కిలోమీటర్లమేర ఎలిఫెంట్ ప్రూఫ్ ట్రెంచెస్ పనులను గతంలో చేపట్టారు. అయితే ట్రెంచికి మధ్యలో రాతి బండల కారణంగా అక్కడక్కడ గ్యాప్‌లున్నాయి. ట్రెంచి వెడల్పు మూడు మీటర్లుగానే ఉంది. ఏనుగులు కొన్ని చోట్ల గుంతలు ఉన్న గుట్టల గుండా, లేదా గుంతల్లోకి మట్టిని నింపి వెలుపలికి వస్తున్నాయి. కేరళ, అస్సాం రాష్ట్రాల్లో ఏనుగులు అడవిలోంచి బయటకు రాకుండా పాత రైలు పట్టాలకు ఫెన్సింగ్‌ను ఏర్పాటు చేసినట్టు ఇక్కడా చేపట్టాలి. స్థానిక అడవిలో కొంతమేర ఇప్పటికే నిర్మించిన కర్ణాటక టైప్ వేలాడే ఫెన్సింగ్‌నైనా పూర్తిస్థాయిలో చేపట్టాలి. అడవికి ఆనుకుని ఉన్న బఫర్‌జోన్‌లో ముళ్లుకలిగిన కలిమిచెట్లు, గారచెట్లు, నిమ్మచెట్లు లాంటివి పెంచితే ముళ్లకు బయపడి ఏనుగులు రాకుండా ఉంటాయని రైతులు సూచిస్తున్నారు. అయితే కౌండిన్య అభయారణ్యం మూడు రాష్ట్రాల పరిధిల్లో ఉండడంతో మూడు రాష్ట్రాలు కలసి ఎలిఫెంట్ కారిడార్ ఏర్పాటు చేస్తేనే సమస్యకు శాశ్వతమైన పరిష్కారం దొరుకుతుంది.

కొత్త ఫెన్సింగ్‌కు ప్రతిపాదనలు పంపాం



పాత, కొత్త సోలార్ ఫెన్సింగ్‌ల మధ్య నున్న గ్యాప్‌లతో పాటు పాత సోలార్ దెబ్బతిన్న చోట్ల మరమత్తులకు ఇప్పటికే రూ.28 కోట్లతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం. ప్రభుత్వం నుంచి నిధులందితే ఫెన్సింగ్ పనులు ప్రారంభిస్తాం. అడవిలోంచి బయటకొచ్చిన ఏనుగులు ఇలా కరెంట్‌షాక్‌లకు గురై మృతి చెందుతుండడం మా శాఖకు చాలా బాధగా ఉంది. – శివన్న, ఎఫ్ఆర్వో, పలమనేరు

సీఎం దృష్టికి తీసుకెళ్లా..



ఎన్నో ఏళ్లుగా ఈ ప్రాంతంలో ఏనుగుల సమస్య ఉంది. గతంలో నిర్మించిన సోలార్ ఫెన్సింగ్ నాశిరకంగా ఉండడంతోనే ఏనుగులు సులభంగా అడవిలోంచి బయటకు వచ్చేస్తున్నాయి. ఇందుకోసం పటిష్టమైన సోలార్ ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి దృష్టికి తీసుకెళ్లాం. సీఎం ఈ సమస్యను తప్పకుండా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.
– వెంకటేగౌడ, ఎమ్మెల్యే, పలమనేరు

ఆ బిడ్డ భద్రం..!

- బాత్‌రూంలో వదిలి వెళ్లిన పసికందుకు ఎస్ఎన్‌సీయూలో చికిత్స
- మెరుగైన వైద్యం అందిస్తున్న వైద్యులు
- బరువు తక్కువ..శ్వాస సమస్యలు ఉన్నట్లు వైద్యుల వెల్లడి
- నెల రోజుల పాటు ఎస్ఎన్‌సీయూలో చికిత్స

చిత్తూరు రూరల్: చిత్తూరు జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి బాత్‌రూమ్‌లో గర్భిణి ప్రసవించి వదిలి వెళ్లిన పసికందుకు వైద్యులు మెరుగైన వైద్యం అందిస్తున్నారు. ఈనెల 16వ తేదీ వేకువజామున కడుపు నొప్పితో వచ్చిన ఓ గర్భిణి ఆస్పత్రి బాత్‌రూంలోనే ప్రసవించి... బిడ్డను వదిలి వెళ్లిన ఘటన విధితమే. ఆపై బిడ్డకు ఎస్ఎన్‌సీయూలో చికిత్స అందిస్తున్నారు. పుట్టినప్పుడు బిడ్డ బరువు 1.4 కేజీలుండగా..ప్రస్తుతం 1.5 కేజీలుందని వైద్యులు చెబుతున్నారు. 2 కేజీలు దాటేంత వరకు ఎస్ఎన్‌సీయూలోనే బిడ్డకు చికిత్స అందించాల్సి ఉంటుందని వెల్లడించారు. దీంతో పాటు శ్వాస తీసుకోవడంలో కూడా బిడ్డకు కాస్త ఇబ్బందులు ఉన్నాయని..మరో రెండు రోజుల్లో ఈ సమస్య కూడా రికవరీ అవుతుందన్నారు. బిడ్డ తక్కువ బరువుతో పుట్టడం వల్ల నాలుగు వారాల పాటు చికిత్స అందించాల్సి ఉందని వైద్యులు పేర్కొంటున్నారు. ఆ తర్వాతే సంరక్షణకు ఐసీడీఎస్ శిశువిహార్‌కు పంపనున్నారు. ప్రస్తుతం ఆశాఖ సిబ్బంది పర్యవేక్షణలోనే బిడ్డకు వైద్య సేవలు చేస్తున్నారు. కాగా బిడ్డ వదిలి వెళ్లిన ఘటనపై కలెక్టర్ ఆదేశాలతో డీఐఓ రవిరాజు విచారణ కూడా పూర్తి చేశారు. దీనిపై సోమవారం కలెక్టర్‌కు నివేదిక సమర్పించనున్నట్లు అధికారులు చెబుతున్నారు.

బిడ్డను మాకు ఇవ్వండయ్యా...

ఆడబిడ్డలంటే చులకన చూసే కళ్లు..ఇప్పటికే చాలానే ఉన్నాయి. ఆడబిడ్డ పుట్టిందని ఆమడ దూరంలోనే నిలబడే తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులను తరచూ చూస్తుంటాం. మగ సంతానం లేదని ఆత్మహత్యలు చేసుకున్న కేసులు సైతం చాలానే ఉన్నాయి. అయితే ఈ వదిలి వెళ్లిన బిడ్డ కోసం పలువురు ముందుకు వస్తున్నారు. ఆ బిడ్డను తమకు ప్రసాదించండంటూ ఆస్పత్రి అధికారులకు నివేదించుకుంటున్నారు. అసలు తల్లి లేకుంటే.. తామున్నామంటూ.. క్యూ కడుతున్నారు. ఎలాంటి లోటు లేకుండా చూసుకుంటామంటూ హామీ ఇస్తున్నారు. ఇలా ఆ బిడ్డనుకోరుకునే వారి సంఖ్య రోజు రోజుకు పెరుగుతోంది. అధికారులు మాత్రం బిడ్డను ఐసీడీఎస్‌కు అప్పగించామని, ఇక చట్ట ప్రకారం వెళ్లాల్సిందేనన్ని స్పష్టం చేస్తున్నారు. బిడ్డను కోరుకునే వారు దతత్త ప్రక్రియ పూర్తి చేయాల్సి ఉంటుందని వివరిస్తున్నారు.

క్లుప్తంగా

ముగ్గురు గంజాయి విక్రేతల అరెస్టు

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరంలో గంజాయి విక్రయిస్తున్న ముగ్గురిని పోలీసులు అరెస్టు చేశారు. ఆదివారం నగరంలోని ఆర్టీసీ బస్టాండు వెనుక ప్రాంతంలో వన్‌టౌన్ సీఐ విశ్వనాథ రెడ్డి సిబ్బందితో కలిసి తనిఖీలు నిర్వహించారు. ఇక్కడ ముగ్గురు వ్యక్తులు చిన్నపాటి సంచులతో అనుమానస్పదంగా తిరుగుతుండగా అదుపులోకి తీసుకుని తనిఖీలు చేశారు. వీరి నుంచి 1.600 కిలోల బరువున్న గంజాయి ప్యాకెట్లను సీజ్ చేశారు. నిందితులు పూతలపట్టు బండపల్లెకు చెందిన పెరుమాళ్ (56), తమిళనాడు రాష్ట్రం వేలూరుకు చెందిన విఘ్నేష్ (21), విజయ్ (27)గా గుర్తించి మాదకద్రవ్యాల నిరోధక చట్టం కింద కేసు నమోదుచేసి, న్యాయమూర్తి ఎదుట హాజరుపరచారు. న్యాయమూర్తి ఆదేశాలతో నిందితులను జిల్లా జైలుకు తరలించారు. గంజాయి ఎక్కడి నుంచి తీసుకొచ్చారు..? ఈ కేసులో ఇంకా ఎవరెవరు ఉన్నారో..? దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

మనస్తాపంతో బాలిక ఆత్మహత్య

కుప్పంరూరల్: పెద్దలు మందలించారన్న మనస్తాపంతో బాలిక ఆత్మహత్య చేసుకున్న సంఘటన కుప్పం మండలం నూలుకుంట గ్రామంలో ఆదివారం చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం మేరకు..నూలుకుంట గ్రామానికి చెందిన రమ్య (13) గ్రామంలో తాత దొడ్డప్ప సంరక్షణలో ఉంటోంది. తల్లిదండ్రులు సిద్దప్ప, కవిత కుటుంబ పోషణకు బెంగళూరులో పనులు చేసుకుంటున్నారు. ఆదివారం తాత దొడ్డప్ప మందలించడంతో రమ్య మనస్తాపం చెందింది. ఎవరు లేని సమయంలో ఇంటి పైకప్పునకు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. దీనిపై పోలీసులను వివరణ కోరగా, తమకు ఎలాంటి సమాచారం లేదని చెప్పారు.


చంద్రయాన్‌-3 ప్లానింగ్ షెడ్యూల్ సక్సెస్

- చంద్రుడికి చేరువలో లూనార్ ఆర్బిట్ ల్యాండర్ మాడ్యూల్
- ఆఖరిఘట్టమే తరువాయి

సూళ్లూరుపేట: భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) గత నెల 14న ప్రయోగించిన చంద్రయాన్‌–3 మిషన్ ప్లానింగ్ షెడ్యూల్ ప్రకారం దశలవారీగా చంద్రుడి కక్ష్యలోకి తీసుకెళ్లే ఆపరేషన్‌ను విజయవంతంగా చేపట్టారు. చంద్రయాన్‌–3 మిషన్ భూమధ్యంతర కక్ష్యలో ఉన్నప్పుడు ఐసారు, లూనార్ ఆర్బిట్లోకి చేరుకున్న తర్వాత మరో ఐసార్లు ఆర్బిట్ రైజింగ్ కార్యక్రమాన్ని బెంగళూరులోని మిషన్ ఆపరేటర్ కాంప్లెక్స్ (ఎంఓఎక్స్), ఇస్రో టెలీమేట్రీ ట్రాకింగ్ అండ్ కమాండ్ నెట్‌వర్క్(ఇస్ట్రాక్), బైలాలులో ఉన్న ఇండియన్ డీప్ స్పేస్ నెట్‌వర్క్ (ఐడీఎస్ఎన్) భూనియంత్రితి కేంద్రాల నుంచి ఇస్రో శాస్త్రవేత్తలు విజయవంతంగా నిర్వహించారు. ల్యాండర్, రోవర్ మాడ్యూల్‌ను తీసుకెళుతున్న ప్రపొల్షన్ మాడ్యూల్ మొత్తం బరువు 2,145 కిలోలు. ప్రపొల్షన్ మాడ్యూల్‌ను భూ మధ్యంతర కక్ష్య నుంచి చంద్రుడి కక్ష్యలోకి ప్రవేశపెట్టడానికి 1,696 కేజీల ఇంధనాన్ని నింపారు. మిగిలిన 449 కేజీలు పేలోడ్ ఇన్స్ట్రుమెంట్స్ ఉన్నాయి. ఈ ప్రపొల్షన్ మాడ్యూల్‌కు అనుసంధానం చేసిన ల్యాండర్, అందులో ఉన్న రోవర్‌ను చంద్రుడి మీదకు విజయవంతంగా తీసుకెళ్లి వదిలిపెట్టింది. ఇప్పటికి రెండు ఘట్టాలను పూర్తిచేశారు. ఇక మూడో ఘట్టమే మిగిలి ఉంది. ఈ ఘట్టాన్ని కూడా ఈనెల 23న బుధవారం సాయంత్రం 5.47 గంటలకు ప్రారంభించి 6.04 గంటలకు ల్యాండర్ మాడ్యూల్‌ను చంద్రుడి ఉపరితలంపైన దించుతుంది.

దశలవారీగా చూస్తే..

- జులై 14 మధ్యాహ్నం 2.35 గంటలకు చంద్రయాన్‌–3 ప్రయోగాన్ని విజయవంతంగా ప్రయోగించారు.



లూనార్ ఆర్బిట్‌లో ప్రపొల్షన్ మాడ్యూల్ ల్యాండర్ మాడ్యూల్‌ను విడిచిపెడుతున్న దృశ్యం

- మొదటిగా చంద్రయాన్‌–3 మిషన్ భూమికి దగ్గరగా అంటే పెరిజీ 175 కిలోమీటర్లు, భూమికి దూరంగా అపోజీ 36,500 కిలోమీటర్లు దూరంలోని భూ మధ్యంతర కక్ష్య (జియో ట్రాన్స్‌ఫర్ ఆర్బిట్)లోకి ప్రవేశపెట్టారు.
- చంద్రయాన్‌–3 మిషన్ కక్ష్యలోకి ప్రవేశించగానే బెంగళూరులోని ఇస్ట్రాక్ కేంద్రం (ఉపగ్రహాల నియంత్రిత భూకేంద్రం) శాస్త్రవేత్తలు స్వాధీనం చేసుకున్నారు.
- గత నెల 15న మొదటి ఆర్బిట్ రైజింగ్ (కక్ష్య దూరం పెంపుదల) మొదటి విడతలో భూమికి దగ్గరగా 173 కిలోమీటర్లు ఎత్తుకు, భూమికి దూరంగా 41,762 కిలోమీటర్లు ఎత్తుకు పెంచారు.
- 17న రెండోసారి భూమికి దగ్గరగా 173 కిలోమీటర్ల ఎత్తును 223 కిలోమీటర్లుకు, భూమికి దూరంగా 41,762 కిలోమీటర్లు ఎత్తును 42,000 కిలోమీటర్ల దూరానికి పెంచారు.
- 18న మూడో విడతలో 224 కిలోమీటర్లు, దూరంగా 51,568 కిలోమీటర్లు ఎత్తుకు పెంచారు.
- 22న నాలుగో విడతలో భూమికి దగ్గరగా 233, దూరంగా 71,351 కిలోమీటర్ల ఎత్తుకు పెంచారు.



ల్యాండర్ మాడ్యూల్‌ను మండించి చంద్రుడికి చేరువగా తీసుకెళుతున్న దృశ్యం

- 25న ఐదోసారి భూమికి దగ్గరగా 236, భూమికి దూరంగా 1,27,609 కిలోమీటర్లు ఎత్తుకు పెంచారు. 25 నుంచి ఆగస్టు 1 అర్ధరాత్రి దాకా చంద్రయాన్‌–3 మిషన్ భూమధ్యంతర కక్ష్యలో పరిభ్రమించింది.
- ఈనెల 1న అర్ధరాత్రి చంద్రయాన్‌–3 మిషన్‌ను పెరిజీలోకి అంటే భూమికి దగ్గరగా వచ్చిన సమయంలో లూనార్ ట్రాన్స్ ఇంజెక్షన్ అనే ఆపరేషన్‌తో భూమధ్యంతర కక్ష్య నుంచి చంద్రుడి కక్ష్య వైపునకు మళ్లించారు.
- 5న భూ మధ్యంతర కక్ష్య నుంచి 3,69,328 లక్షల కిలోమీటర్ల దూరం ప్రయాణించి లూనార్ ఆర్బిట్ (చంద్రుని కక్ష్య)లో 164×18074 ఎత్తుకు చేరింది.
- 6న ప్రపొల్షన్ మాడ్యూల్ లూనార్ ఆర్బిట్‌లో మొదటి సారిగా కక్ష్య దూరాన్ని తగించే ప్రక్రియను ప్రారంభించి 170×4,313 కిలోమీటర్లకు తగ్గించారు.
- 9న రెండో సారి కక్ష్య దూరాన్ని తగ్గించి 174×1437 కిలోమీటర్లు చంద్రుడికి దగ్గరగా తీసుకొచ్చారు.
- 14వ మూడోసారి 151×179 కిలోమీటర్లకు తగ్గించారు.
- 16న నాలుగోసారి 153×163 కిలోమీటర్లకు తగ్గించారు.
- 17న చంద్రయాన్‌–3 119×127 కిలోమీటర్ల ఎత్తులో ప్రపొల్షన్ మాడ్యూల్ ల్యాండర్ మాడ్యూల్‌ను విజయవంతంగా విడిచిపెట్టింది.
- 18న ల్యాండర్ మాడ్యూల్‌లో ఉన్న కొద్దిపాటి ఇంధనాన్ని మండించి చంద్రుడికి చేరువగా అంటే 113×157 కిలోమీటర్లు దగ్గరగా వెళ్లింది.
- 20న అంటే ఆదివారం ల్యాండర్ మాడ్యూల్ చంద్రుడికి మరింత చేరువగా 25×134 కిలోమీటర్లకు చేరుకుంది.
- 23 బుధవారం సాయంత్రం 5.27 గంటలకు ల్యాండర్ మాడ్యూల్‌లో ఇంధనాన్ని 37 నిమిషాలపాటు మండించి 6.04 గంటలకు చంద్రుడి ఉపరితలంపై దక్షిణధృవం ప్రాంతంలో దించేందుకు ఇస్రో శాస్త్రవేత్తలు కసరత్తు చేస్తున్నారు.

ఈ ప్రయోగంలో ఇస్రో మొట్టమొదటి సారిగా థొరెటల్–అబల్ అనే లిక్విడ్ ఇంజిన్‌లను ఉపయోగించి చంద్రుని ఉపరితలంపై ల్యాండర్‌ను మదువైన చోట సేఫ్‌గా ల్యాండింగ్ చేయడానికి ప్రయత్నాలు చేస్తున్నారు.

ల్యాండర్ చంద్రుడిపై దిగిన తరువాత అందులో నుంచి రోవర్ చంద్రుడి ఉపరితలంపై రావడానికి సుమారు 4 గంటల సమయాన్ని తీసుకుంటుంది. రోవర్ చంద్రుడి ఉపరితలంపైకి వచ్చా క సెకనుకు ఒక సెంటీమీటర్ వేగంతో కదులుతూ ఒక లూనార్ డే (చంద్రరోజు) పనిచేస్తుంది. ఒక లూనార్ డే అంటే భూమి మీద కొలిస్తే 14 రోజులు అవుతుంది. ఈ 14 రోజుల్లో అంటే సెప్టెంబర్ 7 దాకా 500 మీటర్లు దూరం ప్రయాణించి చంద్రుడి ఉపరితలంపై మాలాలను పరిశోధించి భూ నియంత్రిత కేంద్రానికి సమాచారాన్ని చేరవేస్తుంది..



బంగారం :	
24 క్యారెట్లు 10 గ్రాములు	రూ.60,000
22 క్యారెట్లు ఒక గ్రాము	రూ.5,460
వెండి:	
హోల్‌సేల్ ధర (కిలో)	రూ.76,000
రిటైల్ వెండి గ్రాము	రూ.79.00

ప్రభుత్వ భూమి కబ్జాకు యత్నం

- అధికారులను దుర్భాషలాడిన ఇద్దరిపై కేసు

చిత్తూరు అర్బన్: ప్రభుత్వ భూమిని కబ్జా చేయడానికి ప్రయత్నించి, అడ్డొచ్చిన రెవెన్యూ అధికారులపై దుర్భాషలాడిన ఇద్దరిపై క్రిమినల్ కేసు నమోదు చేసినట్లు చిత్తూరు టూటౌన్ సీఐ మద్దయ్య ఆచారి తెలిపారు. సీఐ కథనం మేరకు.. చిత్తూరు నగర శివారుల్లోని తిరుపతి–బెంగళూరు జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న తేనబండ రెవెన్యూ గ్రామంలో సర్వేనం–285, 197లో విలువైన ప్రభుత్వ భూములు ఉన్నాయి. వీటిని కబ్జా చేయడానికి అల్తాఫ్ అలీ అనే వ్యక్తి ప్రయత్నిస్తున్నట్లు కలెక్టర్‌కు ఫిర్యాదు అందింది. దీనిపై విచారించాలని చిత్తూరు తహసీల్దర్‌ను కలెక్టర్ ఆదేశించారు. ఆదివారం జేసీబీతో పనులు జరుగుతుండగా రెవెన్యూ అధికారులు వెళ్లి.. పనులు ఆపాలని ఆదేశించగా అల్తాఫ్ అలీ, జేసీబీ డ్రైవర్ కార్తిక్ వారిని అడ్డుకున్నారు. అసభ్యపదజాలాలతో దూషించారు. ఆక్రమణదారులపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని తాహసీల్దార్ మురళీమోహన్ టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఇద్దరిపై క్రిమినల్ కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొని సాఫ్ట్‌వేర్ ఉద్యోగి మృతి

మదనపల్లె : ద్విచక్రవాహనం అదుపు తప్పి విద్యుత్ స్తంభాన్ని ఢీకొని సాఫ్ట్‌వేర్ ఉద్యోగి మృతి చెందిన ఘటన శనివారం రాత్రి మండలంలో జరిగింది. చిత్తూరు జిల్లాలోని పుంగనూరు మండలం చంద్రమాకులపల్లె పంచాయతీ కృష్ణాపురానికి చెందిన శివశంకర్ కుమార్తె పల్లవిని బెంగళూరు నార్త్ వైట్‌ఫీల్డ్ గాంధీపుర మసీదు వీధికి చెందిన అంజనప్ప కుమారుడు బి.ఏ. యశ్వంత్‌కుమార్‌కు ఇచ్చి ఆరు నెలల క్రితం వివాహం జరిపించారు. పల్లవి గర్భం దాల్చడంతో నెలరోజుల క్రితం పుట్టినిల్లు అయిన కృష్ణాపురానికి వచ్చింది. శనివారం యశ్వంత్‌కుమార్ భార్యను చూసేందుకు ద్విచక్రవాహనంలో బెంగళూరు నుంచి కృష్ణాపురం వచ్చాడు. కొద్దిసేపు ఇంటి వద్ద గడిపిన అనంతరం రాత్రి 9.45 గంటలకు వ్యక్తిగత పనులపై ద్విచక్రవాహనంలో మదనపల్లెకు వచ్చాడు. తిరిగి కృష్ణాపురానికి వెళుతుండగా మదనపల్లె–బోయకొండ రోడ్డులోని వలసపల్లె సమీపంలో ద్విచక్రవాహనం అదుపుతప్పి విద్యుత్ స్తంభాన్ని ఢీకొంది. ప్రమాదంలో కిందపడిన యశ్వంత్‌కుమార్‌కు తల, ముఖంపై తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు వెంటనే కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. వారు హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకుని గాయాలతో పడి ఉన్న యశ్వంత్ కుమార్‌ను మదనపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. దీంతో మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు. తాలూకా పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ప్రమాద వివరాలను సేకరించారు. ఆదివారం మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతుడి భార్య పల్లవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ సత్యనారాయణ తెలిపారు.



యశ్వంత్‌కుమార్ (ఫైల్)

శోకసంద్రంలో ముదిరెడ్డిపల్లె

- గజదాడిలో మృతి చెందిన రైతుకు కన్నీటి వీడ్కోలు

పెద్దపంజాణి: మండలంలోని ముదిరెడ్డిపల్లెలో ఏనుగు దాడిలో మృతి చెందిన రైతు మార్కొండయ్యకు గ్రామస్తుల అశ్రునయనాల నడుమ ఆదివారం అంత్యక్రియలు జరిగాయి. శనివారం రాత్రి మార్కొండయ్య ఏనుగు దాడిలో మృతి చెందిన విషయం తెలిసిందే. రాష్ట్ర అటవీశాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రా రెడ్డి, ఎమ్మెల్యే వెంకటేగౌడ ఆదేశాలతో సంఘటన స్థలాన్ని ఫారెస్టు అధికారులు పరిశీలించారు. కేసు నమోదు చేసి మృతదేహాన్ని ఆదివారం పలమనేరు ఏరియా ఆస్పత్రిలో పోస్టుమార్టమ్ నిర్వహించి స్వగ్రామమైన ముదిరెడ్డిపల్లెకు తరలించారు. మృతదేహం గ్రామానికి రాగానే గ్రామం శోకసంద్రమైంది. అనంతరం గ్రామస్తుల అశ్రునయనాల నడుమ అంత్యక్రియలు చేపట్టారు.

గత మూడేళ్లుగా ముగ్గురు..

పెద్దపంజాణి మండలంలోని పెద్దకాప్పల్లె పంచాయతీలో మూడు సంవత్సరాల్లో ఏనుగుల దాడుల్లో ముగ్గురు మృతి చెందారు. దీంతో అటవీ సమీప గ్రామాల ప్రజలకు ఏనుగుల దాడులు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. తరచూ ఏదో ఒక గ్రామంలో పంటలపై దాడులు చేస్తుండడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. రాత్రి వేళల్లో పొలాల వద్దకు వెళ్లాలంటేనే భయపడుతున్నారు. ఏనుగులను అటవీ ప్రాంతం నుంచి పొలాల్లోకి రాకుండా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.



మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న ఎంపీపీ రెడ్డెప్ప, విజయభాస్కర్‌రెడ్డి

బాధిత కుటుంబాన్ని ఆదుకుంటాం..

ఏనుగు దాడిలో మృతి చెందిన మార్కొండయ్య కుటుంబాన్ని ఎంపీపీ రెడ్డెప్ప, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బాగా రెడ్డి పరామర్శించారు. ఎమ్మెల్యే సూచనల మేరకు మృతుని కుటుంబానికి అండగా నిలిచి అన్ని విధాలా ఆదుకుంటామని హామీ ఇచ్చారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి విజయభాస్కర్ రెడ్డి, వైఎస్ ఎంపీపీలు జీడీ బాబు, ఆంజమ్మ, సర్పంచ్‌లు రవికుమార్, చంద్రమోహన్, ఎంపీటీసీ సభ్యులు పరందామ, పావని, లాయర్ భాస్కర్ రెడ్డి, సురేంద్ర తదితరులు ముదిరెడ్డిపల్లెకు వెళ్లి మార్కొండయ్య మృత దేహానికి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు.

వివాహానికి హాజరై వస్తుండగా

- రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలు





తీవ్రంగా గాయపడ్డ చిత్ర, రాజేష్

గుడిపాల: వివాహానికి హాజరై తిరిగీ వస్తుండగా మండల కేంద్రానికి సమీపంలో శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో తల్లీకుమారుడు తీవ్రంగా గాయపడ్డారు. ఎస్ఐ రాజశేఖర్ కథనం మేరకు.. వేలూరు జిల్లా మేల్‌కాటూర్ గ్రామానికి చెందిన రాజేష్(25) సీఆర్‌పీఎఫ్‌గా జమ్మూకాశ్మీర్‌లో పనిచేస్తున్నాడు. ఇతను సెలవుపై స్వగ్రామానికి వచ్చాడు. శనివారం చిత్తూరులో బంధువుల పెళ్లికి తల్లి చిత్ర (45)తో కలసి ద్విచక్ర వాహనంలో వెళ్లాడు. పెళ్లి చూసుకుని రాత్రి 11 గంటల సమీపంలో స్వగ్రామానికి ద్విచక్ర వాహనంలో బయలుదేరాడు. మార్గమధ్యమంలో చెన్నై–బెంగళూరు జాతీయ రహదారి మండలంలోని అనుపు గ్రామం వద్ద ద్విచక్ర వాహనాన్ని వెనుక నుంచి కారు ఢీకొని ఆగకుండా వెళ్లిపోయింది. ఈ ప్రమాదంలో ఇద్దరూ తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు వెంటనే 108 అంబులెన్స్‌లో రాణిపేట సీఎంసీ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

యాళి వాహనంపై ద్రౌపదీదేవి అభయం



యాళి వాహనంపై ద్రౌపదీ సమేత అర్జునస్వామి



గెరిగకు పాదపూజ

పుత్తూరు రూరల్: పుత్తూరు శ్రీద్రౌపదీదేవీ సమేత శ్రీధర్మరాజులస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి యాళి వాహనంపై ద్రౌపదీదేవి సమేత అర్జునస్వామి భక్తులకు అభయమిచ్చారు. ఇంటింటి వద్ద భక్తులు కర్పూర హారతులు సమర్పించారు. ఉదయం 6 గంటలకు ప్రత్యేక అర్చకులు హిమాచలంబాబు ఆధ్వర్యంలో మంచి నీళ్ల గుంట నుంచి సంరక్షకుడుగా పోతురాజు ముందు నడుస్తుండగా గెరిగ ఆలయానికి చేరుకుంది. గెరిగ నీటితో అమ్మవారికి అభిషేకం నిర్వహించారు. స్వామి,అమ్మవార్లను విశేషంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. సాయంత్రం పాండవ, కౌరవ కుమారుల విద్యాభ్యాస ఘట్టం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా తిరుపతికి చెందిన నాగరత్నమ్మ ఆలయ కమిటీ చైర్మన్ లారీమోహన్ చేతుల మీదుగా పేద విద్యార్థులకు స్కూల్ బ్యాగ్స్, నోటుపుస్తకాలు, వితరణ చేశారు. రాత్రి ద్రౌపదీ సమేత అర్జున స్వామి ఉత్సవమూర్తులను సర్వాంగ సుందరంగా అలంకరించి యాళి వాహనంపై కొలువుదీర్చారు. రాత్రి 9 గంటలకు బెస్త సంఘం ఆధ్వర్యంలో ఊరేగింపు వైభవంగా జరిగింది. అనంతరం లక్కాగృహ దహనం ఘట్టాన్ని నేత్రపర్వంగా నిర్వహించారు. రాత్రి 10 గంటలకు శ్రీబాలాజీ వీధి నాట్య కళా బృందం వారిచే చెంచు నాటకం అలరించింది.

నెమలికి నేర్పిన నడకలివీ...

కాణిపాకం(యాదమరి):కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామి ఆలయ ఆస్థాన మండపంలో ఆదివారం సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను కట్టిపడేశాయి. ధర్మపథం కార్యక్రమంలో భాగంగా హైదరాబాద్‌కు చెందిన లంబోతుల కల్చరర్ అకాడమీ కళాకారులు స్వామివారికి నృత్య హారతి కార్యక్రమంలో నిర్వహించిన భరతనాట్యం, కూచిపూడి నృత్య ప్రదర్శనలు రంజింపజేశాయి. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన వంద మందికి పైగా కళాకారులు నృత్య ప్రదర్శనలు చేశారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన చిత్తూరు సివిల్ జడ్జి కరుణ కుమార్ మాట్లాడుతూ కళాకారులు నృత్యాలు అత్యుత్తంగా ఉన్నాయని ప్రశంసించారు. కళలను ప్రోత్సహిస్తున్న పిల్లల తల్లిదండ్రులకు పాదాభివందనం చేయాలన్నారు. అమ్మఒడి ఫౌండర్ పద్మారావు నాయుడు, లంబోతుల అకాడమీ పద్మరావు నాయుడు, ఆలయ అధికారులు పాల్గొన్నారు.



కళాకారిణిల భరతనాట్య ప్రదర్శన



మాట్లాడుతున్న సివిల్ జడ్జి



నృత్య హారతి



కూచిపూడి నృత్య ప్రదర్శన